సాక్షి
ఏలూరు
సోమవారం। 13। జనవరి। 2025



శ్రీవారి క్షేత్రం ముస్తాబు

సంక్రాంతి వేడుకలకు ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రం ముస్తాబైంది. విద్యుత్ దీపాలతో ఆలయం, ప్రాంగణాలు మిరుమిట్లుగొలుపుతున్నాయి. 10లో



ఏలూరులో భారీ చోరీ

ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని ఓ జ్యూయలరీ షాపులో భారీ చోరీ జరిగింది. దుండగులు షాపు వెనుక గోడకు రంధ్రం చేసుకుని లోనికి ప్రవేశించారు. 10లో

సంక్రాంతి శుభాకాంక్షలు



ఏలూరు(మెట్రో) : జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాత్రికేయులకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు జీవితాల్లో కొత్త వెలుగులు, ఆనందం నింపాలని ఆకాంక్షించారు.

న్యూస్‌రీల్

మద్యం దుకాణాలపై దాడులు



ఏలూరులో మద్యం దుకాణం వద్ద సిట్టింగ్ లేకుండా చర్యలు తీసుకున్న దృశ్యం

సాక్షి స్పందన

ఏలూరు టౌన్ : ఏలూరులో మద్యం దుకాణాలపై ఆదివారం 'సాక్షి'లో ప్రచురించిన 'లిక్కర్ షా పుల ఇష్టారాజ్యం' కథనంపై ఎక్సైజ్ అధికారులు స్పందించారు. పలు మద్యం దుకాణాలపై దాడులు చేశారు. ఉదయం జిల్లాలో ఎక్సైజ్ అధికారులతో డిప్యూటీ కమిషనర్ శ్రీలత సమీక్షించారు. నిబంధనలు మీరితే మద్యం షాపుల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని పంపుల చెరువు సమీపంలోని మద్యం దుకాణం వద్ద ఏర్పాటు చేసిన సిట్టింగ్‌ను ఎక్సైజ్ సీఐ ధనరాజు తొలగించారు. షాపు నిర్వాహకులను హెచ్చరించారు.

2,692 బైండోవర్ కేసులు



బరులను ధ్వంసం చేయిస్తున్న పోలీసులు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లావ్యాప్తంగా సంక్రాంతి కోడిపందేలకు బరులు సిద్ధమవుతుండగా.. పందేలు, జూదక్రీడల నియంత్రణకు పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా ఇప్పటివరకూ 2692 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. జిల్లాలో 110కి పైగా బరులు ఏర్పాటుచేసినట్టు గుర్తించి 50కి పైగా బరులను ధ్వంసం చేశారు. 86 మందికి స్థలాలు ఇవ్వకూడదంటూ నోటీసులు జారీ చేశారు. సుమారు 2,354 కోడికత్తులను, 29 కోళ్లు, 4 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల దాడుల్లో రూ.4 లక్షల 59 వేల 170 నగదును సీజ్ చేశారు. మరో రెండు కేసులు నమోదు చేశారు. ఆయా కేసుల్లో మొత్తంగా 228 మంది వ్యక్తులను అరెస్ట్ చేశారు.

16న డీఆర్‌సీ సమావేశం

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ (డీఆర్సీ) సమావేశం ఈనెల 16న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, జిల్లా అధికారులు పాల్గొంటారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులు, అమలవుతున్న సంక్షేమ పథకాలు, భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్, దీపం, ధాన్యం కొనుగోలు, ఇండస్ట్రీయల్ పార్కులకు భూమి లభ్యత, శాంతి భద్రతలు, పరిపాలనాపరమైన అంశాలపై సమీక్షిస్తారు.

విద్యుత్ బిల్లులు భోగి మంటల్లో వేయండి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రవి

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా సోమవారం భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు తగులబెట్టి నిరసన తెలపాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె.శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచబోమని వాగ్దానం చేసిన కూటమి నాయకులు అధికారంలోకి రాగానే ప్రజలపై భారాలను మోపారని విమర్శించారు. అదానీతో విద్యుత్ ఒప్పందాలు రద్దు చేసుకోకుండా ప్రజలపై ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.15 వేల కోట్ల భారాన్ని మోపారన్నారు. గతంలో స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించిన టీడీపీ నాయకులు ఇప్పుడు అదే స్మార్ట్ మీటర్లను సమర్థించడం సిగ్గుచేటన్నారు. ప్రజలకు నష్టం కలిగించే, భారాలను మోపే విద్యుత్ బిల్లులను అందరూ భోగి మంటల్లో వేసి దహనం చేసి నిరసన తెలపాలని కోరారు. సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డీఎన్‌డీ ప్రసాద్, పి.రామకృష్ణ, నాయకులు గుడిపాటి నరసింహారావు, పి.ఆదిశేషు, కె.లెనిన్ తదితరులు పాల్గొన్నారు.



చాటపర్రు గ్రామంలో జనసంచారం లేని రోడ్డు



చాటపర్రు గ్రామ వ్యూ

పల్లె వెలవెల

సంక్రాంతి కళ తప్పింది.. గ్రామాల్లో పెద్ద పండుగ కళాకాంతులు కనిపించడం లేదు.. పల్లెలు ఆర్థిక మాంద్యంతో వెలవెలబోతున్నాయి. ధాన్యం సొమ్ములు దళారులు, అప్పులకే సరిపోవడం, సంక్షేమ పథకాల అమలు లేక ప్రజల చేతిలో డబ్బులు ఆడకపోవడంతో వస్త్ర, కిరాణా వ్యాపారాలు మందగించాయి. కనీసం సంక్రాంతికి చంద్రన్న కానుకగా సరుకులు ఇస్తారనుకుంటే అవీ లేవని మహిళలు వాపోతున్నారు. గతంలో ఎన్నడూ ఇంత దారుణంగా వ్యాపారాలు లేవని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. పంట పెట్టుబడులకు అప్పులు చేయాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఎక్కడా సంక్రాంతి జోష్ కనిపించడం లేదు.

– సాక్షి ప్రతినిధి, ఏలూరు

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

సంక్రాంతి సంబరాలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పెట్టింది పేరు. దేశ, విదేశాలతో పాటు హైదరాబాద్ బెంగళూరు నుంచి జిల్లావాసులు పండుగ కోసం జిల్లాకు తరలివస్తూ మూడు రోజులు సంబరాల్లో ఆనందంగా గడిపి వెళుతుంటారు. సంక్రాంతిని జిల్లాలో అతి పెద్ద పండుగగా భావించి అంబరాన్ని అంటేలా సంబరాలు చేస్తుంటారు. నిషేధాజ్ఞలు ఉన్నా కోడి పందేలు, పేకాట, ఇతర జూద క్రీడలు ప్రతి పల్లెలో తిరునాళ్లను తలపిస్తాయి. ఇదంతా గతేడాది జిల్లాలో పండుగ సాగిన తీరు. ఈ ఏడాది మార్కెట్‌లో నగదు లావాదేవీలు తగ్గిపోవడం, చంద్రబాబు సర్కారు అధికారంలోకి వచ్చాక మార్కెట్ టర్నోవర్ మందగించడం, మధ్య తరగతి, దిగువ మధ్యతరగతి ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గిపోవడంతో పండుగ వెలవెలబోతోంది. జిల్లాలో ఏటా కిరాణా మొదలు బంగారం వరకూ అన్ని వ్యాపారాల్లో మొత్తంగా రూ.200 కోట్లకుపైగా విక్రయాలు జరుగుతుండేవి. జిల్లాలో 450కి పైగా వస్త్ర దుకాణాలు, 364 జ్యూయలరీ షాపులు, 2,170 కిరాణా వ్యాపారాలు, హార్డ్‌వేర్ మెటీరియల్, పెయింట్ షాపులు 210, 45 ప్రధాన హోటళ్లు ఏలూరుతోపాటు మున్సిపాలిటీలు జంగారెడ్డిగూడెం, కైకలూరు, నూజివీడు, చింతలపూడిలో ఉన్నాయి. అధికంగా రూ.140 కోట్ల మేర వస్త్ర వ్యాపారం, రూ.40 కోట్ల మేర బంగారం వ్యాపారం ఉంటాయని అంచనా. ఈ ఏడాది 30 శాతం మేర కొనుగోళ్ల తగ్గగా..

చిన్నబోయిన పెద్ద పండుగ

- కళాకాంతులు లేవు
- సంప్రదాయ వేడుకలకు దూరం
- ఖరీఫ్ ధాన్యం సొమ్ములు దళారులపాలు
- మార్కెట్‌లో మందగించిన కొనుగోళ్లు
- కూటమి ప్రభుత్వ పథకాలు ప్రకటనలకే పరిమితం



నిర్మానుష్యంగా ఏలూరు మండలం చాటపర్రు

ఆన్‌లైన్ వ్యాపారం కూడా అంతంత మాత్రమే.

పల్లెలో సం'క్రాంతులు' కరువు

ప్రధానంగా ఎగువ మధ్య తరగతికి మాత్రమే పండుగ అనే రీతిలో జిల్లాలో పరిస్థితి ఉంది. ఆదివారం ఏలూరు రూరల్ మండలంలోని చాటపర్రు గ్రామంలో 'సాక్షి' క్షేత్రస్థాయిలో పర్యటించింది. పల్లె లో పండుగ సంబరాలపై గ్రామంలో పలువురిని పలకరించింది. అందరూ చేతిలో డబ్బులు ఆడటం లేదు పండుగ కష్టమే అనే సమాధానమిచ్చారు. ప్రధానంగా దిగువ మధ్యతరగతి కుటుంబాలు పండుగకు కొంతమేర దూరంగా ఉన్న వాతావరణం కనిపించింది. బంధువుల రాక హడావుడి కూడా ఎక్కడా కనిపించని పరిస్థితి.

వ్యవసాయ ఆధారితం

చాటగ్రామ గ్రామ జనాభా 3,780, ఓటర్లు 2,460, సాగు విస్తీర్ణం 1,450 ఎకరాలు. గ్రామ స్వభావం పూర్తిగా వ్యవసాయ ఆధారితం. పాడి రైతులతో పాటు రోజు కూలి పనులు చేసుకునే వారే అధికం.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పథకాల లబ్ధి

- చాటపర్రులో 64 డ్వాక్రా గ్రూపుల్లో 640 మంది మహిళలకు వైఎస్సార్ ఆసరా కింద రూ.63 లక్షల లబ్ధి చేకూరింది.
- అమ్మఒడి పథకం ద్వారా 630 మందికి రూ.3,66,90,000 జమ చేశారు.
- జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా 96 మంది విద్యార్థులకు రూ.19,13,390 అందించారు.
- వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా 360 మంది రైతులకు రూ.2,30,40,000 అందించారు.
- వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం ద్వారా 163 మంది రైతులు రూ.60,14 971 లబ్ధి పొందారు.
- వైఎస్సార్ కాపునేస్తం పథకం ద్వారా 104 మందికి రూ.15,60,000 అందజేశారు.
- వైఎస్సార్ చేయూత పథకం ద్వారా 269 మంది మహిళలకు రూ.50,43,750 లబ్ధి చేకూర్చారు.

పండుగ వాతావరణం లేదు



మా గ్రామంలో పండుగ సందడి కనిపించడం లేదు. ఊ రంతా నిస్తేజంగా ఉంది. ఆఖరికి పంట చేతికి వచ్చిన రైతుల్లో సైతం సంతోషం కానరావడం లేదు. పంట డబ్బు అంతా అప్పులకే సరిపోయింది. కూటమి ప్రభుత్వం ఖరీఫ్‌కు సాగు రుణం అందిస్తుందని రైతులు భావించినా ఒక్కపైసా కూడా ఇవ్వకపోవడంతో నిరుత్సాహం ఆవరించింది. గతేడాది జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేసింది. ఆ సొమ్ములతో మహి ళలు ఆనందంగా పండుగ చేసుకున్నారు. ఇప్పుడు ఎక్కడా ఆ పరిస్థితి లేదు.

–గుడిపూడి రఘు, సర్పంచ్, చాటపర్రు

చేతిలో చిల్లిగవ్వ లేదు



చంద్రబాబు సంక్రాంతికి చంద్రన్న కానుక ఇస్తాడనుకున్నా.. అయితే కనీసం నూనె ప్యాకెట్ కూడా ఇవ్వలేదు. గతేడాదిలా ఈ సంక్రాంతికి బూరెలు, గారె లు, పిండి వంటలు వండమని పిల్లలు అడుగుతు న్నారు. ఏదైనా వండుదామన్నా చేతిలో చిల్లిగవ్వ లేదు. మార్కెట్‌లో నూనె ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. గతేడాది జగన్ ప్రభుత్వం నా ఖాతాలో రూ.8 వేలు వేసింది. ఆ డబ్బులతో చక్కగా పిల్లలకు బట్టలు కొని, పిండి వంటలు చేశాను. ఇప్పుడు అప్పు చేద్దామన్నా ఇచ్చే నాథుడు లేదు. సంక్రాంతి ఇలా చప్పగా ఉంటుందనుకోలేదు.

–కె.విజయమ్మ, చాటపర్రు

వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలు, శిలాఫలకాల ధ్వంసం



హోర్డింగులను డ్రైనేజీలో పడవేసిన దృశ్యం



అలుగులుగూడెంలో శిలాఫలకాలను ధ్వంసం చేసిన దృశ్యం

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : ఏలూరు జిల్లా దెందులూరు గ్రామ పంచాయతీ శివారు అలుగులగూడెంలో వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలు, శిలాఫలకాలను ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. తొలగించిన ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను పక్కనే ఉన్న మురుగు కాల్వలో పడవేశారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఫొటోలు, అభివృద్ధి వివరాలతో రెండు శిలాఫలకాలను గ్రామంలో గత ప్రభుత్వంలో ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అనంతరం ఏడు నెలల తర్వాత రెండు శిలాఫలకాలను, ఫ్లెక్సీలను, హోర్డింగులను ధ్వంసం చేయడం గమనార్హం. వైఎస్సార్‌సీపీ హోర్డింగులు, శిలాఫలకాలను ధ్వంసం చేయడం బాధాకరమని, ఇది సరైన సంప్రదాయం కాదని వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు పోకల రాంబాబు, కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ మాజీ డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, సొసైటీ మాజీ చైర్మన్ కొలుసు గణపతిరావు, జిల్లా కమిటీ కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరిరాజు, కొంగర రత్నకుమార్, వార్డు సభ్యురాలు ప్రసన్నరాణి, రవి, గంటా పండు తదితరులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి గ్రామంలోనూ, ప్రతి శివారు ప్రాంతంలోనూ ఆ పార్టీల శ్రేణులు వ్యవహరిస్తున్న తీరును ప్రజలంతా గమనిస్తున్నారని హెచ్చరించారు.

బార్లను తలపిస్తున్న మద్యం షాపులు

- అక్రమంగా సిట్టింగ్ ఏర్పాట్లు
- నిబంధనలు కాలరాస్తూ అమ్మకాలు
- వీధివీధినా బెల్ట్ షాపులు



నూజివీడులోని విస్సన్నపేట రోడ్డులో మద్యం షాపు వద్ద అనధికార సిట్టింగ్

నూజివీడు: నియోజకవర్గంలో మద్యం ఏరులై ప్రవహిస్తోంది. షాపుల వద్దే మందుబాబులు తాగేందుకు గదులను, రేకుల షెడ్లను మద్యం దుకాణాల యజమానులు ఏర్పాటు చేసి తాగిస్తున్నారు. అంతే కాకుండా గ్రామాల్లో వీధివీధినా బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు చేస్తున్నా ఎక్సైజ్ అధికారులు మాత్రం వాటిపై కన్నెత్తి చూడటం లేదు. ఆగిరిపల్లి, ముసునూరు, నూజివీడు పట్టణంలో కొందరు తాము మంత్రి అనుచరులమంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఎక్సైజ్ అధికారులు ఇటుగా కన్నెత్తి చూడటం లేదు. వీధికో గొలుసు దుకాణం ఉండటంతో రాత్రింబవళ్లు మద్యం విక్రయాలు జరుగుతున్నాయి.

పర్మిట్ రూమ్‌లకు అనుమతులు లేకున్నా..

మద్యం దుకాణాల వద్ద కూర్చొని తాగడానికి ఎలాంటి అనుమతులు లేవు. ఏ మద్యం దుకాణానికి కూడా ప్రభుత్వం తాగేందుకు పర్మిట్ రూమ్‌లను ఇవ్వలేదు. అయితే నూజివీడు నియోజకవర్గంలో అక్రమ సిట్టింగ్‌లు ప్రతి షాపు వద్ద యథేచ్ఛగా సాగుతున్నాయి. తుక్కులూరులోని మద్యం షాపు మామిడితోటలో ఏర్పాటు చేయగా, తోట అంతా మందుబాబులకు సిట్టింగ్ ఏర్పాటు చేసి తాగిస్తున్నారు. అలాగే నూజివీడు పట్టణంలోని విస్సన్నపేట రోడ్డులో, మైలవరం రోడ్డులో పశువుల ఆస్పత్రి ఎదురుగా ఉన్న మద్యం దుకాణాల వెనుకభాగాన రేకుల షెడ్లను ఏర్పాటు చేసి కూర్చొబెట్టి తాగిస్తున్నారు. ఇటుగా అధికారులు చూడటం లేదు. చాట్రాయి, ముసునూరు ఆగిరిపల్లి, నూజివీడు మండలాల్లోని 16 షాపుల వద్ద కూడా అక్రమ సిట్టింగ్‌లు ఏర్పాటుచేశారు. ఇక్కడ బార్ అండ్ రెస్టారెంట్‌ల మాదిరిగా అన్నిరకాల ఆహార పదార్థాలు లభిస్తుండటం గమనార్హం. దుకాణాల యజమానులు తాము అధికార పార్టీకి చెందిన వారమంటూ అమ్మకాలు చేస్తున్నారు.

గ్రామస్తుల ఆందోళనలు

గ్రామాల్లో వీధివీధినా బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ఇటీవల మర్రిబంధం గ్రామంలో మద్యం మత్తులో తండ్రి కొడుకులు గొడవ పడగా, తండ్రి కర్రతో కొట్టడంతో కొడుకు మృతిచెందాడు. అలాగే ఆగిరిపల్లి మండలం వట్టిగుడిపాడులోని మద్యం షాపు వద్ద సైతం ఇద్దరు వ్యక్తుల మధ్య ప్రారంభమై కత్తితో నరుకున్న సంఘటన చోటు చేసుకుంది. తమ గ్రామంలో ప్రతి వీధిలో అధిక శాతం గృహాల్లో మద్యాన్ని విక్రయిస్తున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే బెల్టు షాపుల్లో యథేచ్ఛగా తెలంగాణ మద్యాన్ని సైతం విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

టీచర్లకు నెలవారీ బదిలీలు తగదు



వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌టీఏ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యారంగంలో ఇటీవల చేపట్టనున్న మార్పులకు సంబంధించి చేసిన ప్రతిపాదనల్లో కొన్ని సహేతుకంగా లేవని, వాటిని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి.విజయ రామరాజుకు వినతిపత్రం సమర్పించినట్టు వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అశోక్‌కుమార్ రెడ్డి, గెడ్డం సుధీర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఏలూరులో ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులకు నెలవారీ బదిలీలు చేపట్టాలనే ప్రతిపాదనను, ప్లస్ టూ పాఠశాలలను రద్దు చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని కోరామన్నారు. ఇప్పటికే ప్లస్ టూ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తును, పీజీటీలుగా చేస్తున్న ఉపాధ్యాయుల సర్వీస్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకోవాలని సూచించామన్నారు. ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఉపాధ్యాయులపై, ప్రధానోపాధ్యాయులపై మోపుతున్న యాప్‌ల భారాన్ని తొలగించాలని కోరామన్నారు. గతంలో మాదిరిగా ఉపాధ్యాయులకు నెలవారీ పదోన్నతులు కల్పించాలని, మధ్యంతర భృతిని ప్రకటించాలని, పీఆర్‌సీ కమీషన్‌ను వెంటనే నియమించి ఫిట్‌మెంట్ పెంచాలని కోరామని పేర్కొన్నారు.

నేటి నుంచి మావుళ్లమ్మ ఉత్సవాలు



ఉత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్) : భీమవరం మావుళ్లమ్మవారి ఆలయ 61వ జాతర మహోత్సవాలను సోమవారం నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులుచే మధ్యాహ్నం గ్రామోత్సవం, మున్సిపల్ కమిషనర్ రామచంద్రరెడ్డితో సాయంత్రం ఉత్సవాలను ప్రారంభిస్తామన్నారు. ఆఖరి రోజు మహా అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. సుమారు రూ.90 లక్షలతో ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయం చుట్టూ ప్రత్యేక లైటింగ్ సెట్టింగ్‌లను ఏర్పాటుచేశామన్నారు. ఉత్సవాల్లో భాగంగా 24 పౌరాణిక నాటకాలు, 5 బుర్రకథలు, 9 హరికథలు, 14 సంగీత విభావరి, మ్యూజికల్ నైట్స్, 22 కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఏర్పాటుచేశామని చెప్పారు. అనంతరం అమ్మవారి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు.

6 నుంచి అష్టలక్ష్మి అలంకరణలు

ఉత్సవాల్లో భాగంగా వచ్చేనెల 6 నుంచి 14 వరకు అమ్మవారికి అష్టలక్ష్మి అలంకరణ చేయనున్నారు. 6న ఆదిలక్ష్మి, 7న ధాన్యలక్ష్మి, 8న ధైర్యలక్ష్మి , 9న గజలక్ష్మి , 10న సంతానలక్ష్మి , 11న విజయలక్ష్మి , 12న విద్యాలక్ష్మి , 13న ధనలక్ష్మి, 14న అన్నపూర్ణ దేవిగా అలంకరణలు చేస్తారు. కార్యక్రమంలో నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ సభ్యులు తుటారపు ఏడుకొండలు, రామాయణం గోవిందరావు, కొప్పుల సత్తిబాబు, రామాయణం చిన్నారి, కట్టా కొండ, నరహరిశెట్టి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పశువధశాల అనుమతులన్నీ అక్రమం

తణుకు అర్బన్: తణుకు మండలం తేతలి గ్రామ పరిధిలో లాహం ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో నిర్వహిస్తున్న పశువధ శాలకు ఉన్నాయంటున్న అనుమతులు సక్రమంగా లేవని నిర్ధారణ అయ్యిందని గోసేవా సమితి సభ్యుడు కొండ్రెడ్డి శ్రీనివాస్ అన్నారు. తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదివారం ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణను కలిసి అనుమతులపై అభ్యంతరం తెలిపిన నేపథ్యంలో ఆయన ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అశోక్‌వర్మ ఎదుట పశువధ సంస్థ జనరల్ మేనేజర్ అరవింద్ సరీన్‌తో సమావేశమయ్యామన్నారు. సంస్థ చూపిస్తున్న అనుమతి పత్రాలు సక్రమంగా లేన్నట్టు నిర్ధారణ అయ్యిందని, తక్షణమే కర్మాగారంలో కార్యకలాపాలు నిలిపివేయాలని తాము కోరామన్నారు. మాజీ ఏపీపీ వెలగల సాయిబాబారెడ్డి మాట్లాడుతూ పశువధ శాల నిర్వహణకు పంచాయతీ ఎన్‌ఓసీ అవసరం లేదని ఏ జీఓ చెబుతుందని, మూడో షెడ్డుకి రెసిడెన్షియల్‌గా అనుమతి పొంది పరిశ్రమకు ఎలా వినియోగిస్తున్నారని ప్రశ్నించారు. శాంతియుతంగా నిరసన దీక్ష చేస్తుంటే 144 సెక్షన్ ఎలా విధించారని, శ్రీనివాస్‌ను ఎందుకు బైండోవర్ చేశారని నిలదీశారు. అయితే తహసీల్దార్ అశోక్‌వర్మ వీటికి సమాధానం చెప్పకపోవడం హాస్యాస్పదమన్నారు. పశువధశాలకు అండగా నిలుస్తున్న అధికారులు న్యాయస్థానం వద్ద సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు.

క్లుప్తంగా

వేమూరి శ్రీనివాస్‌కు జాతీయ పురస్కారం


వేమూరి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం (టీఓ సీ): పట్టణానికి చెందిన ప్రముఖ కవి వేమూరి శ్రీనివాస్‌కు తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారం దక్కింది. తెలుగు సాహిత్యానికి వేమూరి చేస్తున్న సేవలను గుర్తించి శ్రీ శ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 21న విజయవాడలో పురస్కారం అందజేయనున్నారు.

మంగమ్మ తల్లిని దర్శించుకున్న భక్తులు


గుబ్బల మంగమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని కాపవరం సమీపంలో అటవీప్రాంతంలో ఉన్న గుబ్బల మంగమ్మ తల్లి గుడికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా తరలి వచ్చి మంగమ్మతల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు దర్శనానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, మినీ బస్సుల్లో భక్తులు తరలివచ్చారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మర్లగూడెం అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న పాటమ్మతల్లిని, పసుపులమ్మ తల్లిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెలించుకున్నారు.

అట్టహాసంగా తిరువీధి సేవ


ఉభయ దేవేరులు, గోదాదేవితో క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతున్న శ్రీవారు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా నిత్యం చినవెంకన్న ఉభయ దేవేరులు, గోదాదేవితో క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతున్నారు. ఆదివారం నిర్వహించిన తిరువీధి సేవ భక్తులకు నేత్రపర్వమైంది. తొలుత ఆలయంలో శ్రీవారు, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా స్వామివారి వాహనం క్షేత్ర పురవీధులకు పయనమైంది. అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, గజ, అశ్వ సేవల నడుమ గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. అనంతరం స్థానిక ధనుర్మాస మండపంలో శ్రీవారు, అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు జరిపి, భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్


పోలీసుల అదుపులో నిందితుడు

వేలేరుపాడు: వేలేరుపాడు మండలం మేడేపల్లిలో 35 తెలంగాణ మద్యం సీసాలను ఆటోలో తరలిస్తుండగా సీజ్ చేశారు. ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఆటోను సీజ్ చేసినట్లు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనుబాబు తెలిపారు. దాడులలో ఎస్సైలు ఎస్ఎన్ఎస్ సుబ్రమణ్యం, ఎ.వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.


కాంతులీనుతున్న శ్రీవారి క్షేత్రం

సంక్రాంతికి శ్రీవారి క్షేత్రం ముస్తాబు


భోగి మంటలు వేసేందుకు సిద్ధంగా..

సంప్రదాయం ఉట్టిపడేలా ఏర్పాట్లు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా సంక్రాంతి సంబరాలు జరిపేందుకు ఆలయ అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా శ్రీవారి కొండపైన షాపింగ్ కాంప్లెక్స్ వెనుక ఖాళీ ప్రదేశాన్ని ఆదివారం ముస్తాబు చేశారు. పల్లెల్లో సంక్రాంతి సంబరాలు ఎలా జరుగుతాయో కళ్లకు కట్టినట్లుగా చూపేందుకు అధికారులు శ్రమించారు. భోగి మంటలు వేసేందుకు కట్టెలు సిద్ధం చేశారు. ఆ ప్రాంతాన్ని మహిళలు రంగవల్లులతో తీర్చిదిద్దారు. పూరి గుడిసె, ఈత, తాడి చెట్లు, ఉయ్యాల, ఎడ్ల బండి, సంక్రాంతి విశిష్టతను తెలిపే చిత్రమాలికలు, రంగవల్లులతో గొబ్బిమ్మలు, చెరుకు గెడలు ఇలా పల్లె వాతావరణంలో సంక్రాంతి పండుగ జరిగే తీరును కళ్లకు కట్టినట్టు చూపేలా అన్ని ఏర్పాట్లు చేశారు. క్షేత్రంలో విద్యుద్దీప కాంతులు మిరమిట్లు గొలుపుతున్నాయి. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డీవీ భాస్కర్, ఎలక్ట్రికల్ డీఈ టి.సూర్యనారాయణ, ఏఈఓ వాసు తదితరులు సంక్రాంతి సంబరాల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు


తక్కెళ్లపాడులో గ్రామస్తులు అడ్డుకోవడంతో నిలిచిన పొక్లెయిన్

- తక్కెళ్లపాడులో అక్రమ మట్టి తవ్వకాలు
- తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు

ద్వారకాతిరుమల: గుణ్ణంపల్లి పంచాయతీ తక్కెళ్లపాడులో పోలవరం కుడి కాలువ గట్టుపై జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను ఆదివారం రాత్రి గ్రామస్తులు అడ్డుకున్నారు. అనంతరం ఉంగుటూరు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. అయితే తవ్వకాలు జరుగుతున్న ప్రాంతం ద్వారకాతిరుమల మండల పరిధిలోదని తేల్చి, వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. వివరాల్లోకి వెళితే. మండలానికి చెందిన కొందరు టీడీపీ నేతలు పోలవరం కుడి కాలువ గట్టును ఆర్థిక వనరుగా ఎంచుకుని, జోరుగా అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. ఈ క్రమంలో తక్కెళ్లపాడు గ్రామ శివారులోని పోలవరం కుడి కాలువ గట్టుపై గత కొద్ది రోజులుగా యథేచ్ఛగా ఈ మట్టి దందాను సాగిస్తున్నారు. భీమడోలు, పరిసర ప్రాంతాల్లోని రియల్ ఎస్టేట్ వెంచర్లు పూడ్చే కాంట్రాక్టులు తీసుకుని మరీ.. పచ్చ నేతలు ఈ దోపిడీకి పాల్పడుతున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా మట్టి తవ్వకాలు జరుపుతుండటంతో విసుగు చెందిన తక్కెళ్లపాడు గ్రామస్తులు ఘటనా స్థలానికి వెళ్లి, పొక్లెయిన్‌ను అడ్డుకున్నారు. అనంతరం ఉంగుటూరు మండల రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. అక్కడకు వెళ్లిన వీఆర్వోలు తవ్వకాలు జరుగుతున్న ప్రాంతం ద్వారకాతిరుమల మండల పరిధిలోదని తేల్చి, అక్కడి నుంచి వెళ్లిపోయారు. దాంతో గ్రామస్తులు ద్వారకాతిరుమల తహసీల్దార్‌కు సమాచారం అందించారు. అర్ధరాత్రి వరకు అధికారులెవరూ దీనిపై స్పందించలేదు.

మహిళ మెడలో గొలుసు చోరీ

పాలకొల్లు అర్బన్: ఇంట్లోకి చొరబడి మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీ చేసిన సంఘటన పాలకొల్లు పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని అప్పుగట్లపాలెం శివారు చిత్రాయిచెరువుగట్టుకు చెందిన గొట్టుముక్కల సత్యనారాయణరాజు వ్యవసాయ పనుల నిమిత్తం ఆదివారం బయటకు వెళ్లిన సమయంలో ఆయన భార్య లక్ష్మి ఒంటరిగా ఉందని గమనించిన యువకుడు ఆమె మెడలోని 4 కాసుల బంగారు గొలుసుని లాక్కుని పరారయ్యారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త, అత్తమామలు వేధిస్తున్నారని ఫిర్యాదు

భీమవరం: భర్త, అత్తమామలు తనతో పాటు పిల్లల్ని ఇంటి నుంచి బయటకు గెంటేశారని భీమవరం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి రాయలం గ్రామానికి చెందిన ఎం.కుమారి ఫిర్యాదు చేశారని పోలీసులు చెప్పారు. ఉపాధికి కువైట్‌కు పంపించి, సంపాదించిన నగదును వాడేసుకుని వేరొక మహిళతో తన భర్త అక్రమ సంబంధం పెట్టుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సై రెహమాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనుల పండువగా కుడారై ఉత్సవం


పారిజాతగిరిలో కుడారై మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవ కార్యక్రమంలో భాగంగా కుడారై మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. రంగవల్లికలో ×అక్కారి అడిసెల్ ×విశేష ప్రసాదంను 108 పైగా గంగాలాలతో నింపి శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడికి నివేదనగా సమర్పించారు. కుడారై ఉత్సవ ప్రాముఖ్యతను ఆలయ ప్రధానార్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు వివరించారు. కార్యక్రమానికి విచ్చేసిన భక్తులందరూ కుడారై వెల్లుంసీర్ గోవిందా అనే పాశురాన్ని వినిపించారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం వికాస్ తరంగిణి సభ్యులు ఆర్ఎస్ఎస్వీ అప్పారావు, శ్యామలాంబ నరసవేని, తులసి రత్నం, మహాలక్ష్మి, కర్పూరం రవి, శ్రీరామ మూర్తి తదితరులు పాల్గొన్నారు. గోదా శ్రీకృష్ణ వేషధారణ పోటీలు, పసుపు కొట్టే కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవ ముగింపు కార్యక్రమగా సోమవారం ఉదయం 10:30కు నిర్వహిస్తారు.

ఏలూరు నగరంలో భారీ చోరీ

జ్యూయలరీ షాపులో బంగారం, వెండి ఆభరణాలు అపహరణ


ఏలూరు వన్‌టౌన్ లోకేశ్వరి జ్యూయలరీ షాపులో చోరీ జరిగిన దృశ్యం

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని జ్యూయలరీ షాపులో భారీ చోరీ జరిగింది. దుండగులు షాపు వెనుక గోడకు రంధ్రం చేసుకుని లోనికి ప్రవేశించారు. భారీగా బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదు అపహరించుకుపోయినట్లు తెలుస్తోంది. డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో ఏలూరు వన్‌టౌన్ సీఐ జీ.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్సై మదీనా బాషా సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. సీసీ కెమెరాలు ధ్వంసం చేయటంతో క్లూస్‌టీం రంగంలోకి దిగింది. పోలీస్ అధికారులు ప్రత్యేకంగా దర్యాప్తు ప్రారంభించారు. వన్‌టౌన్ ప్రాంతంలోని బంగారు దుకాణాల సముదాయంలో మామిళ్ళపల్లి రఘురామ్ లోకేశ్వరి జ్యూయలరీ షాపును నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి దుకాణాన్ని మూసివేసి సెక్యూరిటీ డబుల్ షట్టర్‌కు తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం సీసీ కెమెరాలు పనిచేయకపోవటంతో అనుమానంతో 12 గంటలకు వచ్చి దుకాణాన్ని తెరిచి పరిశీలించేసరికి దొంగతనం జరిగినట్లు గుర్తించారు. వెనుకభాగంలో గోడకు రంధ్రం చేసి షాపులోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు మొత్తం అపహరించుకుపోయారు. దొంగలు లోనికి వెళ్ళే ముందే సీసీ కెమెరాలను ధ్వంసం చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఎంతమేర నష్టం జరిగిందో ఇంకా స్పష్టత ఇవ్వలేదని పోలీస్ అధికారులు చెబుతున్నారు. కిలోకు పైగా బంగారం, 30 నుంచి 40 కిలోల వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు తెలుస్తోంది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముసునూరు: గడ్డి మందు తాగి, ఆసుపత్రిపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఎం.చిరంజీవి తెలిపారు. మండలంలోని చెక్కపల్లికి చెందిన మొక్కపాటి నాగేశ్వరరావు కుమారుడు సురేష్ (35) ఓ ప్రైవేటు కంపెనీ వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గ్రామానికి చెందిన కాటేపల్లి మహేష్ వద్ద రూ.4 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. 2021లో వడ్డీతో కలిపి రూ.4,80,000 బాకీ తీర్చాడు. మరుసటి ఏడాది నుంచి మహేష్ ఇంకా రెండు లక్షలు బాకీ ఉన్నావు చెల్లించాలని సురేష్‌ను వేధిస్తున్నాడు. దీంతో సురేష్ గత డిసెంబర్ 22న మండల కేంద్రం ముసునూరులో గడ్డి మందు తాగాడు. మరుసటి రోజున గుర్తించిన బంధువులు అతనిని నూజివీడు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు నందిని


నందిని

ఏలూరు రూరల్: ఏలూరు కస్తూర్బా బాలికల పాఠశాల విద్యార్థిని నందిని జాతీయ బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటుందని పాఠశాల హెచ్ఎం జి.సునీత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి 19 వరకూ తమిళనాడులో ఎస్‌జీఎఫ్ అండర్–17 జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలు జరుగుతున్నాయని వివరించారు. 9వ తరగతి చదువుతున్న నందిని ఇటీవల అంతర జిల్లాల పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర జట్టుకు ఎంపికైందన్నారు. ఇప్పటికే పలు విభాగాల్లో 4 సార్లు జాతీయ పోటీల్లో పాల్గొని స్కూల్‌కు పేరు తీసుకొచ్చిందని వ్యాయామ ఉపాధ్యాయులు కె.మురళీకృష్ణ, ఎంవీఎస్ ప్రసన్న తదితరులు కొనియాడారు.

రూ.4 కోట్ల చోరీ సొత్తు అందజేత

- 23 కేసుల్లో 2.206 కిలోల బంగారు, 9.400 కిలోల వెండి వస్తువులు
- ఏలూరు జిల్లాలో తొలిసారిగా బాధితులకు నేరుగా పంపిణీ
- ఎస్పీ శివకిషోర్‌కు అభినందనల వెల్లువ


రికవరీ సొత్తును బాధితులకు అందజేస్తున్న ఎస్పీ శివకిషోర్, చిత్రంలో అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు టౌన్: ఇళ్లలో చోరీల ఘటనల్లో కేసులను ఛేదించిన తర్వాత సొత్తును రికవరీ చేసి బాధితులకు అందజేయటం పెద్ద ప్రహసనంలా ఉంటుంది. అనేక కేసుల్లో అపహరణకు గురైన బంగారు ఆభరణాలు వెనక్కి వస్తాయనే ఆశలు వదిలేసుకోవడం పరిపాటి. మొదటిసారిగా జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ప్రత్యేక శ్రద్ధ, చొరవతో మారిన చట్టాలకు అనుగుణంగా ఆయా కేసుల్లో అపహరణకు గురైన చోరీ సొత్తును సంబంధిత వ్యక్తులకు అందజేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. బాధితులకు ఒకరోజు ముందుగానే సంక్రాంతి పండుగ కానుకగా ఎస్పీ విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు అందజేశారు.

ఏలూరు జిల్లాలోని భీమడోలు, పెదపాడు, పెదవేగి, ఏలూరు త్రీటౌన్, ఏలూరు రూరల్ తదితర ప్రాంతాల్లో చోరీలకు సంబంధించి రికవరీ చేసిన సొత్తును జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం ఎస్పీ శివకిషోర్ స్వయంగా తన చేతులమీదుగా బాధితులకు అందజేశారు. చోరీ కేసులను ఛేదించటమే కాకుండా విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను వెనక్కి తిరిగి అందజేయటం పట్ల బాధితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ అధికారుల పనితీరును వారంతా మెచ్చుకున్నారు.

23 కేసుల్లో చోరీ సొత్తు పంపిణీ

ఏలూరు జిల్లాలో గత కొంతకాలంగా ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతూ బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదును అపహరించిన కేసులను పోలీస్ అధికారులు ఛేదించారు. 23 కేసులకు సంబంధించి నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకోగా, నూతన చట్టాలను అమలు చేస్తూ ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ విలువైన సొత్తును బాధితులకు అందజేశారు. సుమారు 2 కిలోల 206.6 గ్రాముల బంగారు ఆభరణాలు, 9.40 కిలోల వెండి వస్తువులు, రూ.లక్ష నగదును బాధితులకు అందజేశారు. ఈ సొత్తు విలువ సుమారు రూ.4 కోట్లకు పైగా ఉంటుందని పోలీసుల అంచనా.

- భీమడోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో గుండుగొలనుకు చెందిన మామిళ్లపల్లి లక్ష్మీభవానికి 320 గ్రాముల బంగారు ఆభరణాలు
- ముసునూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గోపవరానికి చెందిన నందిగం తిరుములుకు 44.58 గ్రాముల బంగారు ఆభరణాలు, 277 గ్రాముల వెండి, లోపూడి గ్రామానికి చెందిన శేషగిరిరావుకు 134.38 గ్రాముల బంగారం, 1040 గ్రాముల వెండి, కాట్రేనిపాడుకు చెందిన బడిపాటి సాంబయ్యకు 18.60 గ్రాముల బంగారం, 150 గ్రాముల వెండి, పర్వతనేని రామ్మోహనరావుకు 45.04 గ్రాముల బంగారం, 138 గ్రాముల వెండి, సింహాద్రిపురానికి చెందిన రామకూరి ప్రభావతికి 72 గ్రాముల బంగారం, చెక్కపల్లికి చెందిన మందపాటి వెంకటేశ్వరరావుకు 293 గ్రాముల బంగారం, 1022 గ్రాముల వెండి వస్తువులు అందజేశారు.
- పెదపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో కొక్కిరపాడు గ్రామానికి చెందిన గుండా సరోజినికి 47 గ్రాముల బంగారు ఆభరణాలు, అప్పనవీడుకు చెందిన వటికోటి నాగేశ్వరరావుకు 16 గ్రాముల బంగారం, ఏపూరు గ్రామానికి చెందిన ఎండీ కరీముల్లాకు 30 గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండి.. వసంతవాడ గ్రామానికి చెందిన గెద్దం శ్రీదేవికి 32 గ్రాముల బంగారం, వేంపాడు గ్రామానికి చెందిన అడుసుమిల్లి సత్యనారాయణకు 100 గ్రాముల బంగారు ఆభరణాలు అందజేశారు.
- పెదవేగి పోలీస్‌స్టేషన్ పరిధిలో ముండూరు గ్రామానికి చెందిన అద్దంకి అజయ్‌కు 86 గ్రాముల బంగారం, కిలో వెండి, వంగూరు గ్రామానికి చెందిన బొడ్డు సత్యనారాయణకు 85.4 గ్రాముల బంగారం, దెందులూరు గ్రామానికి చెందిన పామర్తి రాముకు 80 గ్రాముల బంగారు ఆభరణాలు అందజేశారు.
- దెందులూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చల్లచింతలపూడి గ్రామానికి చెందిన బొప్పన తిరుపతిరావుకు 27 గ్రాముల బంగారం, రూ.లక్ష నగదు, సోమవరప్పాడు గ్రామానికి చెందిన బేతినీడి నాగరాజుకు 68 గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండి, వీరభద్రపురానికి చెందిన ముక్కేళ్ళ శివగణేష్‌కు 36 గ్రాముల బంగారం, 103 గ్రాముల వెండి వస్తువులు
- ఏలూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శ్రీరామ్ నగర్‌కు చెందిన ఎన్‌డీవీపీ నాగేంద్రరావుకు 601 గ్రాముల బంగారు ఆభరణాలు, సీఎంఆర్ షాపింగ్ మాల్ మేనేజర్ అంజరి దుర్గాప్రసాద్‌కు 6.5 కిలోల వెండి వస్తువులు అందజేశారు.
- ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చొదిమెళ్ళ గ్రామానికి చెందిన అట్లూరి శివనాగరాజుకు 9 గ్రాముల బంగారం, కొండేటి సతీష్‌కు 32 గ్రాముల బంగారం, ఏలూరు హనుమాన్‌నగర్‌కు చెందిన ములికి రామకృష్ణకు 31 గ్రాముల బంగారు ఆభరణాలు అందజేశారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ఎస్పీ శివకిషోర్ మాట్లాడుతూ.. కేసులను ఛేదించటంలో పోలీస్ అధికారుల ప్రతిభను అభినందించారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తామని, చోరీలు పెరుగుతున్న తరుణంలో ప్రజలు ఇళ్ళ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, భీమడోలు సీఐ యూజే విల్సన్, ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, పెదవేగి సీఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పండుగ ఆనందం.. విషాదాంతం

రోడ్డు ప్రమాదంలో లోడిదిలంకకు చెందిన యువకుడి మృతి


మృతుడు రమేష్ (ఫైల్)


లారీ ప్రమాదంలో మృతి చెందిన రమేష్

కైకలూరు: సంక్రాంతి పండుగకు సొంతూరు వస్తున్న యువకుడిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. అతనికి ఐదు నెలల క్రితమే వివాహం జరిగింది. కలిదిండి మండలం లోడిదిలంక గ్రామానికి చెందిన మేక సత్యనారాయణ కుమారుడు భాగ్య రమేష్(29) హైదరాబాదు చర్లపల్లి సమీపంలో ఓ ఫార్మా కంపెనీలో ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్నాడు. కలిదిండి కాలేజీలో పాలిటెక్నిక్ పూర్తి చేశాడు. అతనికి పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం గ్రామానికి చెందిన యువతితో 5 నెలల క్రితం వివాహం జరిగింది. నెల రోజుల ముందు భార్యతో చర్లపల్లిలో కాపురం పెట్టాడు. పండుగ సందర్భంగా భార్యను వారం రోజుల ముందు పుట్టింటిలో దించాడు. శనివారం గుంటూరు జిల్లా పేరిచర్ల గ్రామానికి చెందిన స్నేహితుడితో కలసి హైదరాబాదు నుంచి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. రాత్రి గుంటూరులో స్నేహితుడిని దించి వస్తుండగా పేరిచర్ల సమీపంలో లారీ ఢీకొట్టింది. దీంతో రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని సొంతూరుకు తీసుకొచ్చారు. మృతుడి సోదరి 10 ఏళ్ల వయస్సులో ప్రమాదం జరగ్గా.. అనంతరం చేసిన ఆపరేషన్ వికటించి మృతి చెందింది. మిగిలిన ఒక్కగానొక్క కుమారుడు మరణించడంతో తల్లిదండ్రులు, బోరున విలపించారు. రమేష్ భార్యను ఓదార్చడం ఎవరి తరం కావడం లేదు.

ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ముదినేపల్లి రూరల్: ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని చిన్నపాలపర్రు సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. ముదినేపల్లికి చెందిన ఖాలీ వెంకటేశ్వర్లు(17) గుడివాడ రూరల్ మండలం మోటూరు వెళ్లి తిరిగి వస్తుండగా చిన్నపాలపర్రు సమీపానికి రాగానే ముదినేపల్లి వైపు నుంచి గుంటూరు వెళుతున్న యువకుడి ద్విచక్ర వాహనం వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలపాలయ్యాడు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వెంకటేశ్వర్లు మృతదేహాన్ని గుడివాడ ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించడంతో పాటు గాయపడ్డ యువకుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గుర్తింపు కార్డు పేరుతో అక్రమ వసూళ్లు

సాక్షి, అమరావతి: ఉపాధి హామీ కార్మికులు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఫొటో గుర్తింపు కార్డుల పేరుతో చేస్తున్న అక్రమ వసూళ్ల ఆపాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. పశ్చిమగోదావరి జిల్లాలో సాగుతున్న ఈ అక్రమ తంతుపై సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గుర్తింపు కార్డుకు రూ.60 చొప్పున వసూలు చేసుకునేలా అక్షయ కమ్యూనికేషన్ అనే ప్రైవేటు సంస్థకు పశ్చిమగోదావరి జిల్లా డ్వామా పీడీ అనుమతివ్వడాన్ని తీవ్రంగా ఖండించారు. వాస్తవానికి గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబుకార్డులున్న ప్రతి ఒక్కరు ఉపాధిహామీ పనులకు అర్హులేనని, వారికి ఎలాంటి గుర్తింపు కార్డులు అవసరంలేదన్నారు. నిబంధనలను తుంగలో తొక్కి కలెక్టర్ ఆదేశాలతో డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు సర్క్యులర్ జారీ చేయడంతో అక్రమ వసూళ్లకు తెరలేసిందన్నారు.